మేలు చేసిన జగనన్నను గెలిపించండి

● చంద్రబాబు హామీలు నమ్మవద్దు
● ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి


గొంటువారిపల్లెలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

కాశినాయన: ప్రజలకు మేలు చేసిన జగనన్నకు ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి కోరారు. శనివారం మండలంలోని గొంటువారిపల్లె గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి జగనన్న చేసిన మేలును, చంద్రబాబు ప్రభుత్వంలో చేసిన మోసాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేస్తే రానున్న రోజుల్లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీగా వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యేగా డాక్టర్ సుధలను గెలిపిస్తే మనందరి కోసం నిరంతరం వారు కృషి చేస్తారన్నారు. చంద్రబాబులా మోసం చేయడం వైఎస్ కుటుంబానికి చేతకాదన్నారు. పార్టీలకతీతంగా ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని కొనియాడారు. చంద్రబాబు ఎన్నికల సమయంలో మోసపూరిత హామీలు ఇస్తున్నారని, గతంలో చంద్రబాబు పాలనలో మేనిఫెస్టోను అటకెక్కించారని విమర్శించారు. జగన్‌మోహన్‌రెడ్డి మాట ఇస్తే తప్పకుండా నెరవేరుస్తారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో మేలు చేసిన ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువ నాయకులు దేవసానిఆదిత్యరెడ్డి, నియోజకవర్గ బూత్‌కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ హనుమంతరెడ్డి, స్థానిక సర్పంచ్ పిచ్చిరెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు రాఘవరెడ్డి, హుస్సేన్, గురివిరెడ్డి, రామసుబ్బారెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

జగనన్న సంక్షేమ సారథి

పోరుమామిళ్ల: జగనన్న సంక్షేమ సారథి అని ఎమ్మెల్యే డాక్టర్ సుధ కొనియాడారు. శనివారం పట్టణంలోని బలిజకోట, ముస్లింకోట, పొట్టి శ్రీరాములువీధి, కొలిమివీధుల్లో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక ఎన్నో విప్లవాత్మక మార్పులు తెచ్చారని ప్రశంసించారు. ఫ్యాన్‌పై ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సీఎం బాషా, ఆప్కాస్ స్టేట్ డైరెక్టర్ డాక్టర్ కల్యాణ చక్రవర్తి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజీవ్‌బాష, మండల కో ఆప్షన్ మెంబర్ అల్లా, ఉపసర్పంచ్ రాళ్లపల్లె రవి, మాజీ నరసింహులు పాల్గొన్నారు.

హనుమంత వాహనంపై శ్రీనివాసుడు


హనుమంత వాహనంపై దర్శనమిస్తున్న స్వామివారు

బద్వేలు అర్బన్ : మండల పరిధిలోని అనంతరాజుపురం పంచాయతీ లక్ష్మీపాలెం గ్రామంలో వెలసిన శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామి వారు హనుమంత వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. అంతకుముందు శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఈఓ శివయ్య, ఆలయ ప్రధాన అర్చకులు భరద్వాజ్, ఆలయ కమిటీ చైర్మన్ మెంటా అశోక్ కుమార్, ఉత్సవ కమిటీ సభ్యులు కామసముద్రం హర్షబాబు, మెంటా చంద్రయ్య, పెద్ద వీరయ్య, రమణమ్మ, లక్షుమ్మ, సుబ్బయ్య, వెంకటసుబ్బమ్మ, చిన్నగురవయ్య, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నేడు గరుడవాహనసేవ

లక్ష్మీపాలెంలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలల్లో భాగంగా ఆదివారం రాత్రి గరుడవాహనసేవ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందులో భాగంగా ఉదయం హంసవాహనసేవ, మోహినీ ఉత్సవం నిర్వహించి రాత్రికి గరుడవాహనసేవ ఉంటుందని తెలిపారు.

చట్టాలు అందరికీ సమానమే


సదస్సులో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి ఖాజా మైనుద్దీన్

చాపాడు : చట్టాలు అందరికీ సమానమేనని, చట్టాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగివుండాలని మైదుకూరు కోర్టు జూనియర్ సివిల్ జడ్జి షేక్ ఖాజా మైనుద్దీన్ అన్నారు. క్షణికావేశంలో తప్పు చేసి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. మండల పరిధిలోని బద్రిపల్లె పంచాయతీ పరిధిలోని పుల్లారెడ్డినగర్‌లో శనివారం సాయంత్రం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ పుల్లారెడ్డినగర్ గ్రామాన్ని సమస్యలు లేని గ్రామంగా గుర్తించారని తెలిపారు. భవిష్యత్తులో కూడా ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవించాలనే ఉద్దేశంతో సదస్సు నిర్వహించడం జరిగిందన్నారు. గ్రామాల్లో సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. వాహనదారులు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని, లైసెన్స్‌తో పాటు ఇన్సూరెన్స్ చేయించుకోవాలన్నారు. చట్టాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని పేర్కొన్నారు. చట్టానికి లోబడి ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు భూషణం, ఎస్‌ఐ ఆర్‌వీ కొండారెడ్డి, ఎంపీడీఓ కార్యాలయం ఎస్‌ఓ రామకృష్ణ, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నారాయణరెడ్డి, ఏజీపీ జ్వాలా నరసింహశర్మ, ప్యానల్ అడ్వకేట్‌లు శివరామకృష్ణ, నానుబాల శ్రీనివాసులు, సీనియర్ అడ్వకేట్ ఎం.నాగిరెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నీమాస్త్రం తెగుళ్ల నివారణ


నీమాస్త్రం తయారీ గురించి వివరిస్తున్న శాస్త్రవేత్తలు

మైదుకూరు : నీమాస్త్రంతో పంటలను ఆశించే రసం పీల్చే పురుగులను, ఇతర తెగుళ్లను నివారించవచ్చని మైదుకూరు మండలం వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి, సీనియర్ శాస్త్రవేత్త ఎం.బాలకృష్ణ అన్నారు. శనివారం మండలంలోని ఆదిరెడ్డిపల్లెలో నీమాస్త్రం తయారీ, వినియోగంపై రైతులకు కేవీకే శాస్త్రవేత్తలు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైతు సుభాష్ చంద్రబోస్ పొలంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త బాలకృష్ణ నీమాస్త్రం తయారీ గురించి రైతులకు ప్రదర్శన ద్వారా వివరించారు. వేపాకులు, ఆవు మూత్రం, ఆవు పేడ 200 లీటర్ల నీటితో కలిపి వారం రోజులు పాటు పులియపెట్టాలని తెలిపారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు శ్రీవిద్యారాణి, బీఎస్ కాంతిశ్రీ, ఫిరోజ్ హుస్సేన్, లక్ష్మి, అభ్యుదయ రైతులు రామచంద్రారెడ్డి, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

రెచ్చగొట్టే వాఖ్యలు చేస్తే కఠిన చర్యలు

సీఐ రామాంజనేయులు



ఖాజీపేట : ఎన్నికల సందర్భంగా రాజకీయపార్టీల నేతలు ఒకరిపై ఒకరు రెచ్చగొట్టే వాఖ్యలు చేసినా.. విమర్శలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని ఖాజీపేట సీఐ రామాంజనేయులు హెచ్చరించారు. శనివారం సీఐ కార్యాలయంలో అన్ని పార్టీల నేతలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఫ్లైయింగ్ స్క్వాడ్, మోడల్ కోడ్ ఆఫ్ కాంటాక్ట్ టీమ్స్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. పార్టీల నాయకులపై రౌడీషీటర్లు, అనుమానాస్పద వ్యక్తులపై నిరంతరం నిఘా పెట్టామని పేర్కొన్నారు. నాయకులు సామాజిక మాధ్యమాల్లో శాంతిభద్రలకు విఘాతం కల్గించే పోస్టులు పెట్టినా ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించినా కేసులు నమోదు చేస్తామని ప్రకటించారు. ఆలయాల్లో చోరీలపై ప్రత్యేక దృష్టి పెట్టామని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని నిర్వాహకులకు సూచించారు.

ఆడ జన్మ ఓ వరం


మాట్లాడుతున్న సీడీపీఓ శ్రీదేవి

మైదుకూరు : ఆడ జన్మ ఓ వరమని, ఆడ పిల్లలను కాపాడుకోవాలని, జీవితంలో వారిని ఎదగనివ్వాలని మైదుకూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ శ్రీదేవి అన్నారు. శనివారం ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో బేటి బచావో బేటి పడావో కార్యక్రమంపై అంగన్‌వాడీ వర్కర్లకు, హెల్పర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీఓ శ్రీదేవి మాట్లాడుతూ ఆడ పిల్లల చదువు గురించి, బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాల గురించి వివరించారు. 18 ఏళ్లు నిండిన తర్వాతే ఆడ పిల్లలకు, 21 ఏళ్లు నిండిన తర్వాతే మగ పిల్లలకు వివాహాలు చేయాలని, ఆ వయసు లోపల వివాహాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ప్రశాంతి, వరలక్ష్మీదేవి, ఓబుళమ్మ పాల్గొన్నారు.

బాలికల పరిరక్షణ అందరి బాధ్యత

చాపాడు: బాలికల పరిరక్షణ, విద్య అందరి బాధ్యత అని ఐసీడీఎస్ సీడీపీఓ సావిత్రమ్మ అన్నారు. స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కేంద్రంలో శనివారం బేటి బచావో.. బేటి పడావో కార్యక్రమంపై అంగన్‌వాడీ వర్కర్లకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ బాలిక సంరక్షణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. బాలికల చదువు, బాల్య వివాహాల వలన కలిగే అనార్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ ప్రొటెక్షన్ ఆఫీసర్ సునీత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు

– సీఐ చిరంజీవి

పోరుమామిళ్ల : ఎన్నికల నియమావళి, నిబంధనలను తప్పక పాటించాలని సీఐ చిరంజీవి అన్నారు. శనివారం ఆయన మీడియా మాట్లాడుతూ రాజకీయ పార్టీలు ఎన్నికల కోడ్‌ను తప్పనిసరిగా పాటించాలన్నారు. కోడ్ పాటించని రాజకీయ పార్టీలపై చట్ట పరిధిలో చర్యలు తప్పవన్నారు. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా బ్యానర్లు ఏర్పాటు చేయడం ఫ్లెక్సీలు కట్టడం, ఇతరత్రా ఏ నిబంధనలు అతిక్రమించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. అధిక మొత్తంలో డబ్బు, బంగారు తీసుకెళ్లాలంటే అనుమతి పొందాలని పేర్కొన్నారు. ఉద్యోగులు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే కేసు నమోదు చేస్తామన్నారు.

సాయుధ బలగాల కవాతు

ప్రొద్దుటూరు క్రైం : ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలను నిర్వహించడమే లక్ష్యంగా కేంద్ర సాయుధ బలగాలతో ప్రొద్దుటూరులోని పలు ప్రాంతాల్లో శనివారం సాయంత్రం కవాతు నిర్వహించారు. డీఎస్పీ మురళీధర్, టూ టౌన్ సీఐ అబ్దుల్‌కరీం కేంద్ర సాయుధ బలగాలతో కలిసి రాజీవ్‌సర్కిల్, శివాలయంసెంటర్, జిన్నారోడ్డు క్రాస్, మోడంపల్లె వీధుల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకునేందుకు పోలీసు యంత్రాంగం సహకారం ఎప్పుడూ ఉంటుందని డీఎస్పీ ఈ సందర్భంగా తెలిపారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా లక్కిరెడ్డి

ప్రొద్దుటూరు : వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా లక్కిరెడ్డి పవన్‌రెడ్డిని నియమించారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు, కడప మేయర్ సురేష్‌బాబు శనివారం నియామక పత్రాన్ని లక్కిరెడ్డి పవన్‌రెడ్డికు అందజేశారు. పవన్‌రెడ్డి గతంలో పార్టీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారు. రాష్ట్ర బేస్‌బాల్ అసోసియేషన్ చైర్మన్‌గా ప్రస్తుతం ఉన్నారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

చంద్రబాబును నమ్మవద్దు

పోరుమామిళ్ల: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును నమ్మి ఓటేస్తే నిండా మునిగిపోతారని, ఆయన చెప్పే మాటలకు, ఇచ్చే హామీలకు విలువ లేదని పీఆర్‌ఆర్‌డీ రాష్ట్ర సలహాదారు నాగార్జునరెడ్డి విమర్శించారు. శనివారం ముద్దంవారిపల్లె, పెన్నంవారిపల్లె, రౌతుపల్లె, రౌతుపల్లె హరిజనవాడలో నాగార్జునరెడ్డి ఇంటింటి ప్రచారం చేశారు. ప్రచారంలో సింగల్‌విండో అధ్యక్షులు వెంగల్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షులు రాజశేఖర్, సర్పంచులు బాలయ్య, చిన వీరభద్రుడు, ఎంపీటీసీ కృష్ణారెడ్డి, మాజీ సర్పంచులు డాక్టర్ మాబు, శ్రీను, ఎస్సీసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాబు పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్‌కు లేఖ

ప్రొద్దుటూరు : కడప, కర్నూలు, చిత్తూరు, అనంతపురం జిల్లాల్లో నీటి ఎద్దడి సమస్యను పరిష్కరించాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి లేఖ రాసినట్లు రాయలసీమ రాష్ట్ర సమితి అధ్యక్షుడు కుంచం వెంకటసుబ్బారెడ్డి శనివారం తెలిపారు. ఈ జిల్లాల్లో వర్షాభావ పరిస్థితుల వల్ల నీటి సమస్య ఏర్పడిందని ఆయన పేర్కొన్నారు. నీటి కొరతతో వ్యవసాయ రంగం కుదేలైందని, తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాయలసీమ ప్రాంతానికి కేటాయించిన నీటి వాటాను తక్షణమే విడుదల చేయాలని కోరారు.

ఓటరు అవగాహన ర్యాలీ

పోరుమామిళ్ల : సాధారణ ఎన్నికల సందర్భంగా పట్టణంలో ఓటర్లను చైతన్య పరిచేందుకు, వారికి అవగాహన కల్పించేందుకు శనివారం తహసీల్దారు శిరీష ఆధ్వర్యంలో మండల కాంప్లెక్స్ నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు. మీ ఓటు–మీ భవిష్యత్తు.. మన ఓటు– మన హక్కు.. ప్రగతికి మెట్టు–మన ఓటు అంటూ ర్యాలీలో నినాదాలు చేశారు.

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామికి పాల్గుణమాసం రెండవ శనివారం శనిత్రయోదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే అభిషేకం నిర్వహించి భక్తుల దర్శనార్థం స్వామివారిని ప్రత్యేక అలంకరణలో ఉంచారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి వారికి కాయకర్పూరం సమర్పించుకున్నారు.

రేపు ఇస్కాన్ ఆధ్వర్యంలో గౌరపౌర్ణమి వేడుకలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో సోమవారం గౌరపౌర్ణమి వేడుకలను అంతర్జాతీయ కృష్ణచైతన్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నట్లు ఇస్కాన్ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5 గంటలకు శ్రీకృష్ణ బలరాముల విగ్రహాలకు విశేష పూజాకార్యక్రమాలతో పాటు భజన, కీర్తన, హారతి, 7 గంటలకు మహా శంఖాభిషేకం, మహా పుష్పాభిషేకం, రాత్రి 7.45 గంటలకు భగవద్గీత ప్రవచనాలు, 8.15 గంటలకు మహాహారతి తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

నేడు, రేపు విద్యుత్ బిల్లులు స్వీకరిస్తాం

మైదుకూరు : విద్యుత్ వినియోగదారులు ఆది, సోమవారాల్లో కూడా విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చని విద్యుత్ ఏఈ రామభద్రయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం, సోమవారం హోలీ సందర్భంగా సెలవు దినాలు అయినప్పటికీ విద్యుత్ బిల్లులు వసూలు కేంద్రాన్ని తెరుస్తామని, వినియోగదారులు ఈ రెండు రోజుల్లో కూడా విద్యుత్ బిల్లులను చెల్లించవచ్చని ఆయన పేర్కొన్నారు.

పాదరక్షలు పంపిణీ

ప్రొద్దుటూరు : పట్టణంలోని యాచకులకు, నిస్సహాయకులకు, వృద్ధులకు ప్రాణదాత సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం వేసవి కాలం సందర్భంగా పాదరక్షలు, భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. గుత్తి వరుణ్ తేజ్, చిరంజీవి, వైష్ణవిల పుట్టిన రోజు సందర్భంగా వారి తల్లిదండ్రులు గుత్తి ఆనంద్‌కుమార్, లక్ష్మీదేవి సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ప్రాణదాత సేవా సమితి చైర్మన్ సునీల్ తెలిపారు.

నేడు చౌడేశ్వరి జ్యోతుల ఉత్సవం

ఖాజీపేట : తొగటవీర క్షత్రియుల ఆరాధ్య దేవత బాల వీర చౌడేశ్వరి జ్యోతుల మహోత్సవాన్ని ఆదివారం అప్పనపల్లె, రంగాపురం గ్రామాల్లో ఘనంగా నిర్వహించనున్నారు. పండుగ సందర్భంగా గ్రామంలోని మహిళలు అందరూ అమ్మవారికి బోనాలు సమర్పించి.. దీవెనలు తీసుకుంటారు. అనంతరం శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకూ గ్రామాల్లో అత్యంత వైభవంగా జ్యోతులను గ్రామాల్లో ఊరేగిస్తారు.

జేబుదొంగల అరెస్ట్

పోరుమామిళ్ల : బెస్తవీధిలో దొంగతనాలకు పాల్పడిన ఇద్దరు జేబుదొంగలను శనివారం పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల వద్ద నుంచి రూ.30 వేలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. నిందితులను నెల్లూరు జిల్లా బోగోల్ మండలం కప్పరాళ్లతిప్ప గ్రామానికి చెందిన బచ్చు రాము (54), పసుపులేటి శేఖర్ (46)గా గుర్తించారు. వీరిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

ప్రొద్దుటూరు బస్సు యాత్ర రాష్ట్రానికి ఆదర్శం కావాలి

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరులో ఈ నెల 27న నిర్వహించనున్న మేమంతా సిద్ధం బస్సు యాత్ర రాష్ట్రానికి ఆదర్శం కావాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ప్రతి కార్యకర్త, నాయకుడు సమావేశానికి హాజరై మన సత్తా చూపాలని కోరారు. స్థానిక కొర్రపాడు రోడ్డులోని మైదానంలో శనివారం సాయంత్రం కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నెల 27 నుంచి ఏప్రిల్ 21 వరకు ఎన్నికల ప్రచారంలో భాగంగా మేమంతా సిద్ధం పేరుతో బస్సు యాత్రను నిర్వహిస్తున్నారన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, సీఎం జగన్ ఈనెల 27న ఇడుపులపాయలో కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. వీరపునాయునిపల్లె, ఎర్రగుంట్ల మీదుగా అదే రోజు మధ్యాహ్నం 2 గంటలకు అయ్యప్పస్వామి ఆలయం ప్రాంతంలో విడిది చేస్తారన్నారు. భోజనం విరామం అనంతరం సినీ హబ్, ఆర్టీసీ బస్టాండ్, శివాలయం, రాజీవ్ సర్కిల్, కొర్రపాడు రోడ్డు మీదుగా రింగ్ రోడ్డులో తిమ్మయ్య కల్యాణ మండపం ఎదురుగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం జగన్ ప్రసంగిస్తారని తెలిపారు.

వెంటిలేటర్‌పై టీడీపీ

రాష్ట్రంలో టీడీపీ వెంటిలేటర్‌పై ఉందని ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డి ఎద్దేవాచేశారు. ప్రతి కార్యకర్త ఈ విషయాన్ని గమనించి ఎన్నికల్లో పార్టీ విజయం కోసం కృషి చేయాలని కోరారు. నియోజకవర్గంలో 87 శాతం మంది సంక్షేమ పథకాలు అందించామని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలకు తాగునీరు అందించామని, పెన్నానదిపై బ్రిడ్జిని నిర్మిస్తున్నామని, మార్కెట్ నిర్మాణంలో ఉందని, కొత్త బస్టాండ్‌ను నిర్మిస్తున్నామని తెలిపారు. ప్రతి గ్రామ పంచాయతీలో ఆస్పత్రులను ఏర్పాటు చేశామని, పాఠశాలలను అభివృద్ధి చేశామని వివరించారు. టీడీపీ 2014–19 వరకు చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని తాను సవాల్ విసిరినా ఆ పార్టీ అభ్యర్థి స్పందించలేదన్నారు. పాతికేళ్లపాటు ఎమ్మెల్యేగా ఉండి ఈ నియోజకవర్గానికి వరదరాజులరెడ్డి ఏమి చేశారని ప్రశ్నించారు. టీడీపీ నాయకులు రాష్ట్రవ్యాప్తంగా ఉనికి చాటుకునేందుకు దుష్ప్రచారం చేస్తున్నారో ప్రొద్దుటూరులో కూడా అలానే చేస్తున్నారని మండిపడ్డారు. ఈ ఎన్నికల్లో 40 వేల ఓట్ల మెజార్టీతో విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీదేవి, ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీ రాజారాంరెడ్డి, మున్సివైస్ చైర్మన్లు ఆయిల్ మిల్ ఖాజా, పాతకోట బంగారు మునిరెడ్డి, రాజుపాళెం వైస్ ఎంపీపీ నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శులు పోరెడ్డి నరసింహారెడ్డి, లక్కిరెడ్డి పవన్‌రెడ్డి, జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ కల్లూరు నాగేంద్రారెడ్డి, అటవీ అభివృద్ధిసంస్థ డైరెక్టర్ సానపురెడ్డి ప్రతాప్‌రెడ్డి, కొర్రపాడు సూర్యనారాయణరెడ్డి, ప్రొద్దుటూరు మండల కన్వీనర్ మార్తల ఓబుళరెడ్డి, బీసీ కార్పొరేషన్ల డైరెక్టర్లు ఉప్పర మురళి, తుపాకుల వెంకటరమణ హాజరయ్యారు.

రాచమల్లు దంపతులకు ఘన స్వాగతం

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, ఆయన సతీమణి రాచమల్లు రమాదేవి కౌన్సిలర్‌గా ప్రాతినిథ్యం వహిస్తున్న 26వ వార్డులో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వార్డు ఇన్‌చార్జి పొలగిరి ఖాజా ఆధ్వర్యంలో ఈ ప్రచారం సాగింది. ఈ సందర్భంగా రాచమల్లు దంపతులకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తాము ఎన్నికల ప్రచారానికి వచ్చినట్లు లేదని, శుభకార్యానికి వచ్చినట్లు ఇంటింటా ప్రజలు ఆహ్వానం పలికారన్నారు. ఈ వార్డుకు సంక్షేమ పథకాల ద్వారా రూ.25 కోట్లు మంజూరైందని, రూ.కోటితో అభివృద్ధి పనులు చేపట్టామని వివరించారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన వసుంధర

గత మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఇదే వార్డు నుంచి రాచమల్లు రమాదేవికి ప్రత్యర్థిగా పోటీ చేసిన టీడీపీ అభ్యర్థి గుండ్లదుర్తి వసుంధర ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. అశ్వర్థ నారాయణరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, మాజీ కౌన్సిలర్ ఏరువ సరోజమ్మ, శౌరెడ్డి పాల్గొన్నారు.

మేము సిద్ధం బస్సు యాత్రను జయప్రదం చేయండి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి

మైదుకూరు: ఈ నెల 27న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించనున్న మేము సిద్ధం బస్సు యాత్ర ను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో దువ్వూరు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 27న ప్రొద్దుటూరులో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించే మేము సిద్ధం బస్సు యాత్రపై చర్చించారు. ప్రతి మండలం నుంచి 4వేల మంది హాజరయ్యే విధంగా సన్నాహాలు చేస్తామన్నారు. ప్రొద్దుటూరులో మధ్యాహ్నం 3 గంటలకు నియోజకవర్గ నాయకులతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడతారని, సాయంత్రం 4 గటలకు బహిరంగ సభ ఉంటుందని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి తెలిపారు. సమావేశంలో వ్యవసాయశాఖ సలహాదారుడు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, దువ్వూరు ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, మండల కన్వీనర్ చిరాకి మహబూబ్ బాషా, మాజీ జెడ్పీటీసీ గుడిపాడు బాబు, హరినాథరెడ్డి, వ్యవసాయశాఖ జిల్లా సలహాదారుడు ఓబుళకొండారెడ్డి, బొంతపల్లి వెంకటసుబ్బారెడ్డి, పద్మనాభ రెడ్డి, గుడిపాడు ఎంపీటీసీ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ యువజన కన్వీనర్ శివశంకర్‌రెడ్డి, చంద్ర ఓబుళరెడ్డి, సర్పంచ్ చెండ్రాయుడు తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఆదర్శప్రాయుడు భగత్‌సింగ్


భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లకు కొవ్వొత్తులతో నివాళి అర్పిస్తున్న నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : భగత్‌సింగ్ భారత జాతికి స్ఫూర్తి ప్రదాత అని, ఆయన చూపిన మార్గం యువతకు ఆదర్శమని జనవిజ్ఞాన వేదిక రాష్ట్రకార్యదర్శి తవ్వా సురేష్‌రెడ్డి అన్నారు. స్థానిక నెహ్రూరోడ్డులోని గీతాంజలి హైస్కూల్‌లో శనివారం భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తవ్వా సురేష్‌రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ మహనీయులని కొనియాడారు. వీరి స్ఫూర్తిగా తీసుకుని యువత ముందుకు పోవాలని సూచించారు.

భగత్‌సింగ్ ఆశయాలు కొనసాగించాలి

ప్రొద్దుటూరు : భగత్ సింగ్ ఆశయాలను కొనసాగించాలని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు బి.రామయ్య, పట్టణ కార్యదర్శి పి.సుబ్బరాయుడు, విరసం వరలక్ష్మి పిలుపునిచ్చారు. శనివారం రాత్రి వారు పుట్టపర్తి సర్కిల్‌లో భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి సందర్భంగా కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిరుప్రాయంలోనే దేశం కోసం పోరాడి వారు ప్రాణాలను త్యాగం చేశారని కొనియాడారు. వారిని స్ఫూర్తిగా తీసుకుని ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న కేంద్ర ప్రభుత్వంపై ఉద్యమించాలన్నారు. లౌకిక వాదం, దేశ సమగ్రత కోసం యువత పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు హరి, చంద్రశేఖర్, శివారెడ్డి, రామకృష్ణ, యేసోబ్, శ్రీను, రచయిత మహమూద్ పాల్గొన్నారు.

భగత్ సింగ్‌కు ఘన నివాళి

మైదుకూరు : మైదుకూరులో శనివారం ఆల్ ఇండియా స్టూడెంట్స్ యూనియన్ (ఏఐఎస్‌యూ) ఆధ్వర్యంలో భగత్‌సింగ్ 93వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు జగదీష్, ప్రధాన కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ భగత్‌సింగ్ స్ఫూర్తితో విద్యార్థులు, యువకులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌యూ జిల్లా కార్యదర్శి ప్రతాప్, నగర అధ్యక్షుడు రమణ, కార్యదర్శి రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్నకు అండగా నిలవండి


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి

బద్వేలు అర్బన్ : యువత సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి యువత అండగా నిలవాలని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డిశ్రీకాంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ నెల 27న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రొద్దుటూరులో నిర్వహించనున్న మేము సిద్ధం సభకు వేలాదిగా యువత పాల్గొని సభను జయప్రదం చేయాలని కోరారు. శనివారం మండల పరిధిలోని బయనపల్లెలో యువజన విభాగం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2014 ఎన్నికల సమయంలో నిరుద్యోగభృతి చెల్లిస్తామని హామీలిచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ఆ హామీలను విస్మరించి యువతను మోసం చేశారని విమర్శించారు. జగనన్న ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే సచివాలయ వ్యవస్థ ద్వారా 1.60 లక్షల ఉద్యోగాలు కల్పించి యువతకు అండగా నిలిచారని తెలిపారు. అంతేకాకుండా పరిశ్రమల ఏర్పాటుతో స్థానికంగా ఉన్న నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించిన ఘనత వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ యువ విభాగం జిల్లా జనరల్ సెక్రటరీ గంగిరెడ్డి, జిల్లా సెక్రెటరి ప్రణీత్, మున్సిపాలిటీ అధ్యక్షుడు పి.శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి, రవికుమార్‌రెడ్డి, రాంప్రసాద్‌రెడ్డి, వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఎన్జీఓ రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం

ప్రొద్దుటూరు క్రైం: ఏపీ ఎన్జీఓ అధ్యక్షుడు కేవీ శివారెడ్డి శనివారం ప్రొద్దుటూరులోని ఎన్జీఓ హోంకు వచ్చారు. ఈ సందర్భంగా స్థానిక ఎన్జీఓ నాయకులు రాష్ట్ర అధ్యక్షుడిని సన్మానించారు. అనంతరం ఎన్జీఓ నాయకులతో కేవీ శివారెడ్డి పలు విషయాలపై చర్చించారు. ఇప్పటికే ప్రభుత్వం ఉద్యోగులకు రావాల్సిన రెండు డీఏలు ఇవ్వడంతో పాటు కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయడం జరిగిందని ఆయన తెలిపారు. నెలాఖరులో జీపీఎఫ్ లోన్‌లు, ఏపీజీఎల్ఐ బకాయిలను ప్రభుత్వం ఇస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు ఎన్జీఓ అధ్యక్షుడు కేజే రఘురామిరెడ్డి, కార్యదర్శి రామసుబ్బయ్య, సహ అధ్యక్షుడు సదాశివయ్య, మహిళా విభాగం చైర్మన్ జయమ్మ పాల్గొన్నారు.